ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 26 నవంబరు 2024





ఉమారుద్రుడికి అభిషేకం

కోటి కాంతుల దీపోత్సవం



శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం సంధ్య వేళ.. కోటి దీపకాంతులతో సిక్కోలు నగరం దేదీప్యమైంది. శ్రీకాకుళంలోని కత్తెరవీధి మైదానంలో (పీఎస్ఎన్ఎం స్కూల్ వెనుక) సోమవారం సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన కోటి దీపోత్సవం వైభవంగా సాగింది. పుణ్యపువీధికి చెందిన శ్రీ సీతారామ సహిత ఆంజనేయస్వామి ఆలయ ధర్మకర్త, విశ్రాంత బ్యాంకు అధికారి ముక్కాల కొండబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వందలాది మహిళలు, భక్తులు పాల్గొని దీపాలు వెలిగించారు. ప్రధాన వేదిక వద్ద అరసవల్లికి చెందిన రుత్వికులు హరి సూర్య ప్రసాద్ శర్మ, ఒడిశా నుంచి వచ్చిన ఉమా మహేశ్వర సిద్ధాంతి ప్రవచనాలు చేశారు. శాస్త్రోక్తంగా సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు 108 మంది దంపతులతో 108 శివలింగాల వద్ద రుద్రాభిషేకాలు, దశవిధ హారతుల పూజలు నిర్వహించారు. కార్తీకమాసం విశిష్టత వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్ దంపతులతోపాటు దుప్పల వెంకటరావు, ఎం.కొండబాబు, ఆర్.అరవింద, ఎం.నారాయణ రావు, సుంకర కృష్ణ పాల్గొన్నారు.



కోటి దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు



రుద్రాభిషేకంలో పాల్గొన్న 108 మంది దంపతులు

లక్ష రుద్రాక్షల ఉమారుద్రుడు

- ప్రత్యేకంగా అలంకరణ
- శివాలయాల్లో భక్తుల రదీ

6లో

శైవక్షేత్రాల్లో శివనామస్మరణ మార్మోగింది. కార్తీకమాసం నాల్గో సోమవారం పురస్కరించుకుని.. శ్రీకాకుళంలోని ఉమారుద్ర కోటేశ్వరాలయం, శ్రీముఖలింగేశ్వరాలయం, టెక్కలిలోని ఎండలమల్లికార్జున స్వామి ఆలయాలకు అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. ఉమారుద్ర కోటేశ్వరుడ్ని లక్ష రుద్రాక్షలతో అలంకరించగా.. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



శ్రీ ముఖలింగేశ్వర ఆలయంలో భక్తుల రద్దీ



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అర్జీల పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : ఫిర్యాదుదారులు సంతృప్తి చెందేలా అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక "మీకోసం"లో ఆయన జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి 65 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, జడ్పీ సీఈవో ఎల్ఎన్వీ.శ్రీధర్ రాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.




ర్యాలీలో పాల్గొని ప్రతిజ్ఞ చేస్తున్న మహిళా ఉద్యోగులు, సిబ్బంది

6లో

మహిళలపై హింసకు పాల్పడితే కఠిన చర్యలు

గిరిజనం.. అభివృద్ధికి దూరం

- సక్రమంగా అమలుకాని చట్టాలు
- అవగాహన లోపంతో వెనుకబాటు
- హక్కుల కోసం ఏళ్లుగా పోరాటం
- నేడు రాజ్యాంగ దినోత్సవం



మూలరింపిలో గిరిజనుల ఇళ్లు

మెళియాపుట్టి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తరాలు.. ప్రభుత్వాలు.. మారుతున్నా గిరిజన ప్రాంతాలు మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదు. వారి ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా చట్టాలు రూపొందించినా.. నిరక్షరాస్యత, అవగాహన లోపంతో అవి సక్రమంగా అమలు కావడం లేదు. మంగళవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గిరిజనుల కోసం రూపొందించిన కొన్ని చట్టాలు.. వాటి అమలు తీరును పరిశీలిద్దాం. భారత రాజ్యాంగం ప్రకారం వెనుకబడిన ప్రాంతాలతోపాటు కులాలను 342 (1) కింద ఎస్టీలుగా గుర్తించి.. వారికి విద్య, రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలి. గిరిజనుల్లో మరింత వెనుకబడిన తెగలును ప్రత్యేక సమస్యాత్మక గిరిజన తెగలు(పీవీటీజీ)గా గుర్తించాలి. ఈ మేరకు జిల్లాలో సవర, పోర్జ, గదబ, చెంచు, కొండ తెగలును వెనుకబడిన కూలాలుగా గుర్తించారు. కానీ వారికి విద్య, రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలు మాత్రం అంతంతమాత్రమే. హక్కుల కోసం పోరాడుతున్నా.. పట్టించుకున్న వారే లేని దుస్థితి నెలకొంది.

ఇదీ పరిస్థితి..

ఉమ్మడి జిల్లాలోని సీతంపేట ఐటీడీఏ ప్రాంతంలో 848 గ్రామాల్లో 1.60 లక్షల మంది గిరిజనులు ఉన్నారు. జిల్లా పునర్విభజన తర్వాత పార్వతీపురం మన్యం జిల్లాకు 378 గ్రామాలు, శ్రీకాకుళం జిల్లాకు 470 గ్రామాలు కేటాయించారు. ఆయా గ్రామాల గిరిజనులకు చట్ట ప్రకారం రావాల్సిన నిధులు మాత్రం కేటాయించకపోవడంతో అభివృద్ధికి దూరమవుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం సబ్‌ప్లాన్ నిధులు సైతం దారి మళ్లించింది. గ్రామాల్లో రహదారులు, తాగునీటి వసతి తదితర కనీస అభివృద్ధి పనులను విస్మరించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇటీవల బడ్జెట్‌లో గిరిజన సంక్షేమానికి రూ.7,557కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతోనైనా అభివృద్ధి చేపడతారని గిరిజనులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



మెళియాపుట్టి మండలం దబ్బగూడలో 14 మంది విద్యార్థులు ఉన్నారు. కనీసం ఇక్కడ పాఠశాల భవనం లేదు. దీంతో గిరిజన సామాజిక భవనంలో ఓవైపు మండల పరిషత్ పాఠశాల తరగతులు, మరోవైపు అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. గిరిజనుల విద్యాహక్కు చట్టప్రకారం వసతులు కల్పించాల్సి ఉంది. కానీ, గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. పాఠశాలల భవనాల నిర్మాణానికి సైతం నిధులు మంజూరు చేయలేదు. దీంతో గిరిజనులకు ఇబ్బందులు తప్పడం లేదు.

చట్టాలపై అవగాహన లేక..

- గిరిజనుల ఆర్థికాభివృద్ధి కోసం రూపొందించిన రాజ్యాంగ చట్టాలు కొంతమందికి తెలియక ఇంకా వెనుకబాటుకు గురవుతూనే ఉన్నారు. ఏజెన్సీలో న్యాయపాలన, సివిల్ కోర్టులు, సమీకృత గిరిజనాభివృద్ధి, అటవీహక్కుల గుర్తింపు చట్టం సక్రమంగా అమలుకావడం లేదు. అలాగే షెడ్యూల్డ్ ప్రాంతంలో స్థానిక సంస్థలు, పెసా చట్టం, కుల ధ్రువీకరణ పత్రాలు జారీ, రుణవడ్డీ, వ్యాపార నిబంధనలు, షెడ్యూల్డ్ కులాలు, తెగలు అత్యాచార నిరోధక చట్టం రూపొందించినా.. అవగాహన లేక అమలుకు దూరమవుతున్నాయి.
- గిరిజన ఉప ప్రణాళిక విధానం సక్రమంగా అమలు కావడం లేదు. ప్రధానంగా రెండు లక్ష్యాలతో ఈ విధానం రూపకల్పన చేశారు. గిరిజనుల ఆర్థిక, సామాజిక అభివృద్ధితోపాటు వివిధ రకాల దోపిడీ నుంచి కాపాడుకునేందుకు రాష్ట్ర బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలి. కానీ వారి నిధులు వారికి వినియోగించకుండా గత వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించింది.
- గిరిజనులు అప్పు తీసుకున్నా వడ్డీ కింద ఏడాదికి 24శాతం మించి తీసుకుంటే కేసులు నమోదు చేయవచ్చని 1917లో చట్టం చేశారు. కానీ వ్యాపారులు అధికంగా వడ్డీ వసూలు చేస్తున్నారు. గిరిజనుల అభివృద్ధే ధ్యేయంగా 1979లో వారి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. కానీ ఈ కార్పొరేషన్ నిధులు సక్రమంగా అందక.. గిరిజనులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.
- ఉమ్మడి జిల్లాలోని

(మిగతా 6వ పేజీలో..)



వరి కుప్పలు, ధాన్యం భద్రం చేస్తున్న రైతులు

పలాస రూరల్: సవర గోవిందపురంలో..



గార: గొర్లెవానిపేటలో..



టెక్కలిలో..


వాయు'గండం'

- వాతావరణంలో మార్పులు
- ఆందోళనలో ధాన్యం రైతులు
- భద్రపరిచేందుకు అవస్థలు

టెక్కలి/ పలాస రూరల్/ మెళియాపుట్టి/ గార/ నందిగాం/ పోలాకి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మరింత బలపడే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈ ప్రభావంతో కోస్తా జిల్లాల్లో రెండురోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఈ క్రమంలో సోమవారం ఆకాశంలో దట్టమైన మబ్బులు కమ్ముకుని.. వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. తుఫాన్ గుబులు వారిని వెంటాడుతోంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి పంట ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఎంతో సంబరపడ్డారు. ప్రస్తుతం పొలాల్లో వరి కోతలు చేపడుతున్నారు. ధాన్యాన్ని విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నారు. కాగా.. జిల్లాలో ఇప్పటివరకూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. ప్రస్తుతం తుఫాన్ గుబులు వెంటాడుతున్న నేపథ్యంలో ఆ ధాన్యాన్ని భద్రపరిచే పనిలో నిమగ్నమయ్యారు. టెక్కలి, పలాస, మెళియాపుటి, గార, నందిగాం, పోలాకి మండలాల్లోని పలు గ్రామాల్లో రైతులు ధాన్యా న్ని బస్తాల్లో నింపి సురక్షిత ప్రాంతాలకు తరలి స్తున్నారు. పలాస మండలం రెంటికోట, తర్లాకోట, కైజోల, కొత్తూరు, సవరగోవిందపురం, సుబ్బుగుడ్డి, దానగొర, హిమగిరి, మహాదేవపురం, సున్నాడ తదితర గ్రామాల్లో వరికుప్పలుపై టార్పన్లు కప్పారు. ఈ సమయంలో వర్షాలు కురిస్తే తమకు తీవ్ర నష్టమేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు.



పోలాకిలో..



నందిగాంలో..



రాజగోపాలపురంలో నిర్మించిన సీసీ రోడ్డు, కాలువ

ఆ ఊరికి పల్లెపండుగే

- రూ.35 లక్షలతో ఊరంతా సీసీ రోడ్లు
- కేవలం 20 రోజుల్లో పనులు పూర్తి
- కూటమి ప్రభుత్వం చొరవతో అభివృద్ధి

పలాస, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మొత్తం 500 ఓట్లు ఉన్న గ్రామానికి రూ.35లక్షల నిధులు మంజూరయ్యాయి. ఊరు మొత్తం సిమెంట్ రహదారులు నిర్మించారు. ఆ ఊరి పేరు రాజగోపాలపురం. పలాస మండలంలో ఉంది. దీంతో మట్టిరోడ్లులేని గ్రామంగా ఆ ఊరు మారిపోయింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్ల మరమ్మతులపై దృష్టి పెట్టింది. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా రాజగోపాలపురం గ్రామానికి రూ.35లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు వచ్చేలా కృషి చేశారు. రహదారుల నిర్మాణానికి అక్టోబరు 20వ తేదీన భూమిపూజ చేశారు. గ్రామంలో పార్టీలకు అతీతంగా సమావేశమై ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా గడువుకు

(మిగతా 6వ పేజీలో..)



లక్ష రుద్రాక్షల ఉమారుద్రుడు

● ప్రత్యేకంగా అలంకరించిన అర్చకులు ● భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
● కార్తీకమాసం చివరి సోమవారం రద్దీ

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో శైవక్షేత్రాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి నగరంలోని నాగావళి నది ఒడ్డున ఉన్న ఉమా రుద్ర కోటేశ్వరాలయంలో ఉదయం 5 నుంచి దర్శనానికి బారులుదీరారు. ఈశ్వరుడికి మహాన్యాస పూర్వక అభిషేకాలు, క్షీరాభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో లక్ష రుద్రాక్షలతో ఉమారుద్ర కోటేశ్వరుడిని అలంకరించారు. అలాగే శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారిని కూడా అలంకరించారు. మహిళలు ముందుగా నందీశ్వరుని వద్ద దీపాలు వెలిగించి అనంతరం స్వామి వద్దకు వెళ్లి పూజలు చేశారు. నక్కవీధిలోని ఉమాజలేశ్వరాలయం, కొన్నా వీధిలో భీమేశ్వర ఆలయం, గుజరాతీపేటలోని లక్ష్మేశ్వరస్వామి ఆలయం, బలగలోని ఉత్తరేశ్వరా లయంలో, దీపామహల్ వెనుక ఉన్న కాశీ విశ్వేశ్వర ఆలయం, మహాలక్ష్మి నగర్ కోలనీలోని మండలేశ్వరాలయం, పాలకొండ రోడ్డులో ఉన్న నీలకంఠేశ్వర స్వామి ఆలయాలకు కూడా భక్తులు పోటెత్తారు. బొందిలీపురం షిరిడీ సాయిబాబా ఆలయంలో ఉన్న శివలింగానికి భక్తులు క్షీరాభిషేక పూజలు చేశారు. నారాయణ తిరుమల, చిన్నబజార్‌లో ఉన్న దూదివారి కోవెల వెంకటేశ్వర స్వామి ఆలయం, విశాఖ ఏ కోలనీలో ఉన్న శివబాలాజీ ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ఉమారుద్రకోటేశ్వరాలయంలో క్యూలో భక్తులు


ఉమారుద్రుడికి అభిషేకం చేస్తున్న దృశ్యం


ఎండలమల్లికార్జునస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఎండల మల్లన్నకు పోటెత్తిన భక్తులు

టెక్కలి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో రావివలస ఎండల మల్లికార్జునస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి ఉత్కళాంధ్రులు ఎండల మల్లన్నను దర్శించుకున్నారు. ఉచిత దర్శనం, సర్వదర్శనం, శిఖర దర్శనాల క్యూలైన్లలో భక్తులు బారులుదీరారు. దర్శనాలకు ఇబ్బందులు కలగకుండా దేవాదాయ శాఖ ఈవో జి.గురునాథరావు చర్యలు తీసుకున్నారు. మజ్జిగ, మంచినీరు, ప్రసాదం పంపిణీ కార్యక్రమాలను పూర్వపు ఆలయ కమిటీ చైర్మన్ ఎల్ఎల్ నాయిడు పర్యవేక్షించారు. వేకువజాము నుంచి మధ్యాహ్నం వరకు రావివలస రాకపోక మార్గాలు కిక్కిరిశాయి. గోపీనాథపురం, పాతబస్టాండ్ జంక్షన్లలో కొంతసేపు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి.


రావివలస చేరుకుంటున్న భక్తులు



జలుమూరు: బారికేడ్లు నిండిపోవడంతో రోడ్డుపై క్యూలో భక్తులు.. స్వామివారికి అభిషేకం చేస్తున్న దృశ్యం


శ్రీకాకుళం కల్చరల్: కోటి దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

భక్తులతో ఉప్పొంగిన 'శ్రీముఖలింగం'

జలుమూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగం భక్తజనంతో ఉప్పొంగింది. కార్తీకమాసం ఆఖరి సోమవారం శ్రీముఖలింగేశ్వరుని దర్శనానికి బారులు తీరారు. వంశధారనదిలో స్నానాలు ఆచరించి స్వామి దర్శించుకొని అభిషేకాలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలిరావడంతో కూ లైన్లు భక్తులతో కిటకిటలాడాయి. జిల్లా విజిలెన్ ఎస్పీ బి.ప్రసాదరావు దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ విశిష్టతను అర్చకులు వినిపించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆర్జేడీ చిన్మయిదేవి స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు.


ఆరాట్టు ఉత్సవ పూజల్లో పాల్గొన్న భక్తులు

ముగిసిన ఆరాట్టు బ్రహ్మోత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బలగలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో ఆరాట్టు బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఆలయ అర్చకులు దేవరకొండ శంకరనారాయణ శర్మ ఆధ్వర్యంలో స్వామి మూలవిరాట్‌కు నవవిధ ద్రవ్య, అష్టాభిషేకాలు నిర్వహించారు. పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార, పళ్లరసాలు, విభూతి చందనం, పుష్పాలతో స్వామి అయ్యప్పకు అభిషేకాలు నిర్వహించారు. పుణ్యాహవచనం, గజరోహణం, అంకురారోహణ, సహస్రకళాభిషేకం నిర్వహించారు. అయ్యప్ప మాలదారులు స్వామి పల్లకీ సేవలో పాల్గొన్నారు.


స్వామి వారి విగ్రహ ఉత్సవమూర్తుల ఊరేగింపులో పాల్గొన్న స్వాములు

ఆ ఊరికి 'పల్లె పండుగే'

(ఐదో పేజీ తరువాయి)

ముందే పనులు చేయాలని తీర్మానించారు. కాలువలు, రోడ్ల నిర్మాణానికి అడ్డుగా ఉన్న ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించారు. స్థానిక యువకులు, టీడీపీ, వైసీపీ నాయకులు ఏకమై గ్రామాభి వృద్ధికి చర్యలు చేపట్టారు. వెయ్యి మీటర్ల రహదారి పనుల పూర్తికి మూడు నెలలు గడువు ఉండగా.. 20 రోజు ల్లోనే పూర్తి చేశారు. ప్రస్తుతం రాజగోపాల పురంలో ఏ కాలనీకి వెళ్లినా సీసీ రోడ్లు దర్శ నమిస్తున్నాయి. వారం క్రితం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అభివృద్ధి పనులను పరిశీ లించేందుకు గ్రామానికి వచ్చి సంతృప్తి వ్య క్తం చేశారు. ఇంకా ఏం కావాలని అడిగా రు. కాలువలు, అమ్మవారి ఆలయం వరకు రోడ్డు కావాలని గ్రామస్థులు కోరడంతో తక్షణం రూ.20 లక్షలతో అంచనాలు వేయాలని పంచాయతీ రాజ్ డీఈఈ రవికుమార్‌ను ఆదేశించారు.


గ్రామంలోని ఓ వీధిలో డ్రైనేజీ, సీసీ రోడ్డు

మహిళలపై హింసకు పాల్పడితే కఠిన చర్యలు

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళలపై హింసకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. మహిళలపై హింస నిర్మూలన దినం సందర్భంగా సోమవారం జడ్పీ కార్యాలయం నుంచి సంతోషిమాత గుడి వరకు ర్యాలీని ఆయన జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలపై హింస నిర్మూలన కార్యక్రమాలు వైద్యారోగ్యశాఖ, మహిళా స్త్రీశిశు సంక్షేమశాఖ, డీఆర్డీఏ శాఖల సమన్వయంతో నెల రోజులు పాటు నిర్వహిస్తామన్నారు. మహిళలకు సంబంధించి న్యాయ కేంద్రాలు ఉన్నాయని, మహిళా, స్త్రీ శిశు సంక్షేమశాఖ నుంచి జీజీహెచ్‌లో ఒన్‌స్టాప్ ఉందని, కుటుంబ సమస్యలు ఉంటే న్యాయ సహాయ కేంద్రం ఉందని ఆయన తెలిపారు. ఒన్‌స్టాప్ సెంటర్లు మహిళల కోసం ప్రతీచోటా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎక్కడైనా మహిళలపై గృహహింస, పనిచేసే స్థలాల్లో హింస జరిగితే స్థానిక, ఇంటర్ డిపార్ట్‌మెంట్, కలెక్టరేట్‌లో కమిటీలకు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, బీసీ సంక్షేమశాఖ అధికారి అనూరాధ, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ దినకర్ స్వప్నిల్ పుండ్కర్


గ్రామశివార్లకు వచ్చి మాట్లాడుతున్నా రింపి గ్రామస్తులు

హలో.. హలో వినిపించటం లేదు

మెళియాపుట్టి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పథకాలు మరింత పారదర్శకంగా ప్రజలుకు అందివ్వాలన్న ఉద్దేశంతో అన్‌లైన్ సేవలను వినియోగించు కుంటోంది. ఇందులో భాంగా ప్రస్తుతం ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారు. ఉపాధి అవకాశాలు కల్పించటానికి ప్రభుత్వం సచివాలయ సిబ్బంది ద్వారా వివరాలు సేకరిస్తోంది. అయితే కొన్ని గిరిజన గ్రామాల్లో నెట్‌వర్క్ లే క సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. పింఛన్ల పంపిణీ చేసేటప్పు డు సైతం ఇక్కట్లు తప్పడం లేదు. మూరుమూల గిరిజన గ్రామాల్లో ప్రజలు కూడా మొబైల్ సిగ్నిల్స్ లేక పక్క గ్రామాలకు వెళ్లే పరిస్థితు లు ఉన్నాయి. సీతంపేట ఐటీడీఏ పరిధిలో 250 గ్రామాలకు నెట్‌వర్క్ లేక ఇబ్బందులు పడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. మూరు మూల గ్రామాలకు సిగ్నల్ సేవలు అందించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం మెళియాపుట్టి, సీతంపేట, మందస, పాతపట్నం, కొత్తూరు మండలాల పరిధిలో గత ఏడాది చర్యలు చేపట్టింది. కొండల ప్రాం తంలో సెల్‌టవర్లను నిర్మించినా ఇంత వరకు ప్రారంభం కాలేదు. దీంతో అధికారులు, ప్రజలు సిగ్నల్స్ అందక ఇబ్బందులు పడుతున్నారు. మూరుమూల గ్రామాల్లో పనిచేస్తున్న సచివాలయాలతో పాటు పాఠశాలల ఉపాధ్యాయులు కూడా ఫేస్‌యాప్‌లు పనిచేయక సతమ తమవుతున్నారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు, ఎవరైనా అనారోగ్యా నికి గురైనప్పుడు 108 వాహనానికి సమాచారం ఇవ్వాలంటే మొబైల్ తీసుకుని సిగ్నల్ వచ్చేచోటకు పరుగులు తీయాలి. ఈ నేపథ్యంలో సెల్‌టవర్లు ప్రారంభించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గిరిజనం.. అభివృద్ధికి దూరం

(ఐదో పేజీ తరువాయి)

పాలకొండ నియోజకవర్గం సీతంపేటలో 1971-72లో ఐటీడీఏ నెలకొల్పారు. జిల్లా పునర్విభజన సమయంలో పాలకొండ నియోజకవర్గం పార్వతీపురం మన్యం జిల్లాలో విలీనమైంది. దీంతో సీతంపేట ఐటీడీఏ కూడా ఆ జిల్లా పరిధిలోకి వెళ్లిపోయింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఐటీడీఏ కొనసాగుతున్నా.. నిధులు కేటాయింపు సక్రమంగా లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో కొత్త ఐటీడీఏ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. చట్టాలపై అవగాహన కల్పించి.. అభివృద్ధికి కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


దారి లేని దబ్బగుడ్డి గ్రామం

దోపిడీపై విచారణ చేయాలి



గిరిజన చట్టాలుపై అవగాహన లేక వెనుకబాటుతనం కనిపిస్తోంది. చట్టా లపై అవగాహనతోపాటు.. అధికంగా ఆర్థిక, రాజకీయ అవకాశాలు కల్పించాలి. గత వైసీపీ ప్రభుత్వం చట్టం అమలు చేయకుండా నిధులు దోపిడి చేసింది. దీనిపై విచారణ చేయాలి.

- బైరిశింగి లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ, మెళియాపుట్టి

చట్టం కోసం తెలియదు



మా గిరిజనులకు చట్టం అంటే తెలియదు. ఎన్ని ప్రభుత్వాలు మారినా మా బతుకులు మారడం లేదు. ఇప్పుడిప్పుడే అధికారులు మా గ్రామానికి వచ్చి పథకాల కోసం చెబుతున్నారు.

- జన్ని పోలమ్మ, కేరాశింగి, మెళియాపుట్టి

చదువుకోక పోవడం వల్ల



మేము చదువుకుందామనుకున్నా.. అప్పుడు పాఠశాలలు అందుబాటులో లేవు. చదువుకోకపోవడం వల్ల మేము మోసపోతున్నాం. మా ప్రాంతాల్లో అభివృద్ధి జరగడం లేదు.

- ఎస్.జయ్యమ్మ, కేరాశింగి

అవగాహన కల్పిస్తున్నాం..



గిరిజనులకు చట్టాలపై స్వచ్ఛంద సంస్థలు ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. గ్రామసభలు ఏర్పాటు చేసి వారి ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

- ప్రసాద్‌పండా, ఎంపీడీవో, మెళియాపుటి

నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలి

● మంత్రి అచ్చెన్నాయుడును కలిసిన యూనివర్సిటీ అధికారులు

ఎచ్చెర్ల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):టీడీపీ హయాంలో గతంలో బీఆర్ ఏయూకు మంజూరైన నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలని వర్సిటీ అధికారులు కోరారు. ఈ మేరకు సోమవారం నిమ్మాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని, రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కలిశారు. వర్సిటీలో రూ.38 కోట్ల అంచనా వ్యయంతో సీపీడబ్ల్యూ ఇంజనీర్ల పర్యవేక్షణలో నిర్మించిన పరిపాలనా భవనం ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు. 2020లో ప్రకటించిన రూ.15 కోట్ల అడ్వాన్స్ నిధులు కూడా ఇప్పటికీ విడుదల కాలేదని మంత్రికి వివరించారు.

గడువులోగా సిలబస్ పూర్తిచేయాలి: కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణతాశాతం పెరిగేలా బోధించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. నిర్ణీత గడువులోగా సిలబస్ పూర్తిచేసి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తీర్ణతాశాతం పెరిగితే అడ్మిషన్ల సంఖ్య కూడా పెరుగుతుందని తెలిపారు. విద్యార్థులు కళాశాలలకు చేరుకునేందుకు ఆర్టీసీ మెరుగైనా రవాణా సౌకర్యాలు కల్పించాలని కోరారు. సమావేశంలో జిల్లాలోని 38 ప్రభుత్వకళాశాలల ప్రిన్సిపాళ్లు, ఇంటర్ విద్యాశాఖ అధికారి తవిటినాయుడు, ఆర్ఐవో దుర్గారావు, ఆర్టీసీడీఎం కేఆర్ఎస్ శర్మ పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం: ఎస్పీ



అర్జీదారులతో మాట్లాడుతున్న మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని పోలీసు అధికారులకు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదిక మీకోసంలో 60 వినతులొచ్చాయి. ఈ సందర్భంగా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.

ఆర్గానిక్ పంటలతో ఆరోగ్యం

సరుబుజ్జిలి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆర్గానిక్ పంటలు ఆరోగ్యానికి దోహదపడతాయని ఎంపీడీవో ఎం.పావని తెలిపారు. రొట్టవలస, పెద్దపాలెం గ్రామాల రైతులు సేంద్రీయ ఎరువులతో పండించిన కూరగాయలను సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద విక్రయించారు. ఈ సందర్భంగా రైతులు ఎంపీడీవో, ఏవో పద్మనాభం, ఏపీఎం గోవిందరావులు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు మణి, వివిధ శాఖలకు చెందిన అధికారులు అభినందించారు.

తప్పుడు బిల్లుల చెల్లింపుపై చర్యలకు తీర్మానం

పొందూరు, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో పెనుబర్తి పంచాయతీలోని అలమాజీపేటలో చేసిన పనికి తప్పుడు బిల్లులు చెల్లింపుపై అధికారులు, బిల్లు తీసుకున్నవారిపై చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ తీర్మానించాలని టీడీపీ సభ్యులు పట్టుపట్టారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కిల్లి ఉషారాణి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన మండలపరిషత్ సాధారణ సమావేశంలో ఎంపీటీసీ సభ్యురాలు కూనప్రమీల ఆధ్వర్యంలోని టీడీపీ సభ్యులు నిరసన తెలిపారు. అధికారులు స్పందించకపోతే టీడీపీ ఎంపీటీసీసభ్యులు సర్పంచ్‌లతో కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు. దీంతో చర్యలు తీసుకోవడానికి ఎంపీడీవో మన్మథరావు తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం రూ.15 కోట్లతో జరుగుతున్న పనులకు సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. పెనుబర్తి పంచాయతీలో కార్యదర్శి, వార్డుసభ్యులకు తెలియకుండా సర్పంచ్ రూ.లక్ష పంచాయతీ ఖాతా నుంచి డ్రా చేయడంపై కూన ప్రమీల ప్రశ్నించారు. కార్యదర్శికి తెలియకుండా డ్రాచేసిన విషయం వాస్తవమేనని, చర్యలు తీసుకుంటామని ఈవోఆర్డీ పి.సింహాచలం తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కుమారి, హారిక, వాణి, చల్లమాంబ, పి.కళ్యాణి, హనుమంతురావు, సూర్యారావు, రమణ, సర్పంచ్‌లు వేణుగోపాల్, పైడి రామప్రసాద్, అనంతరామకృష్ణ, జె. శ్రీనివాసరావు, కె. జ్యోతి, పాల్గొన్నారు.

బ్యాంకు అకౌంట్ లింక్ చేసుకోవాలి

ఆమదాలవలస, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఖాతాదారులు ఎన్‌పీసీఐతో లింక్ చేసుకోవాలని మునిసిపల్‌కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ పథకాలు, ఇతర ప్రభుత్వ సంబంధమైన లావాదేవీలు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ కావాలంటే తప్పనిసరిగా లింకును చేయించాలని పేర్కొన్నారు.

కూలీల కొరత.. యంత్రాలతో కోత

● కూలి ధరలు పెంచేస్తున్నవైనం ● రైతులపై అదనపు భారం



గరుడఖండి వద్ద యంత్రంతో వరిపంట కోస్తున్న రైతు

పలాస రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):మండలంలోని తర్లాకోట, కైజోల, సున్నాడ, అల్లుకోల, గరుడఖండి, కిష్టుపురం, బ్రాహ్మణతర్లా, లక్ష్మీపురం, పూర్ణభద్ర, అమలకుడియా, నారాయణపురం, కేశుపురం, బంటుకొత్తూరుల్లో ముమ్మర్మంగా ఖరీఫ్ వరికోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రధానంగా కూలీల కొరత వల్ల అన్నదాతలు యంత్రాలను ఆశ్రయిస్తున్నారు.కొన్నిచోట్ల ఎకరా వరికోతకు మహిళలు రూ.4 నుంచి రూ.5వేల వరకూ డిమాండ్ చేస్తున్నారు.కూలీలకొరతను ఆసరాగా చేసుకుని కూలి ధరలు అమాంతంగా పెంచేస్తున్నారని రైతులు వాపోతున్నారు. దీంతో ఎకరాకు రూ.1500 నుంచి రూ.2000 వరకూ వసూలు చేస్తుండడంతో యంత్రాలతో కోతలకు రైతులు మొగ్గుచూపుతున్నారు. కూలి ధరలు పెంచడం వల్ల అధనపు భారం పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది మండలంలో 12 వేల ఎకరాల్లో వరి సాగుచేయగా, ఇప్పటి వరకు 40 శాతం వరకూ కోతలు పూర్తయ్యాయి.

భక్తి శ్రద్ధలతో లక్ష దీపోత్సవం

జి.సిగడాం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎందువ కైలాసగిరి కొండపై గల నవదుర్గాదేవి అమ్మవారి ఆలయం వద్ద కార్తీకమాసోత్సవం పురస్కరించుకుని ధర్మకర్త నేతేటి సత్యనారాయణ, శర్మ, ధనలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో సోమవారం కార్తీక లక్షదీపోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ముఖద్వారం నుంచి కైలాసగిరి శిఖరం వరకు నిర్వహించిన దీపోత్సవం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా జనసేన రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి పొగిరి సతీష్‌బాబు, నియోజకవర్గం ఇన్‌చార్జి విశ్వక్‌సేన్ మాట్లాడుతూ ప్రతిఒక్కరిలో భక్తిభావం పెంపొందాలన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి తాలబత్తుల పైడిరాజు పాల్గొన్నారు.

● శ్రీకాకుళం కల్చరల్, నవంబర్ 25 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో సామూహిక లక్ష వత్తుల దీపారాధన ఉత్సవం మిమిక్రీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రుత్వికులు మంతెన అనీల్ శర్మ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, 101 లీటర్ల పాలతో క్షీరాభిషేకాలు, పంచామృతాలతో పాటు రుద్ర హోమం చేశారు.101 మంది మహిళలు, కన్యలతో లక్ష వత్తుల దీపారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పులఖండం శ్రీనివాస్, మురకయ్య గాయకులు కేఎల్ఎన్‌మూర్తి, శిల్లా లక్ష్మణరావు పాల్గొన్నారు.



జి.సిగడాం: దీపోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఉమాజీవేశ్వరాలయంలో మహాకుంభాభిషేకం

శ్రీకాకుళంలోని ఉమాజీవేశ్వరాలయంలో మహా కుంభాభిషేకాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండప పూజలు, సూర్య నమస్కారాలు, చండీ రుద్ర యాగాలు నిర్వహించారు. కార్యక్రమంలో కె.శ్రీను, మందేల అనిల్ రంగాబట్ల శ్రీను, ప్రకాష్ పంతులు, రవీంద్ర యాగాటి ప్రసాద్, బస్మారవి చిత్రాడ గాందీ చంద్ర శేఖర్ అర్చకులు వెంకటేశ్వరరావు శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎమ్మెల్యే



అరసవల్లి: వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి,నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. సోమవార శ్రీకాకుళంలోని విశాఖ-ఏ కాలనీ లోగలతనకార్యాలయంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పించకపోవడంతో ప్రజల నుంచి పింఛన్లు, గృహాలు, డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణం కోసం పెద్ద ఎత్తున వినతులు అందుతున్నాయని తెలిపారు. డివిజన్లలో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయాయని చెప్పారు.

●శ్రీకాకుళం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):రూరల్ మండలంలోని కిష్టప్పపేటలోని పార్వతీ కైలాసేశ్వర స్వామివారికి ఎమ్మెల్యే గొండు శంకర్, స్వాతి దంపతులు సోమవారం పూజలు నిర్వహించారు. ఆలయానికి ఉదయం నుంచే వేలాదిగా భక్తులు తరలివచ్చారు.

చింతామణి అమ్మవారి ఆలయంలో పూజలు



అశోక్‌ను సన్మానిస్తున్న కవిటి గ్రామస్థులు

కవిటి,నవంబరు25(ఆంధ్రజ్యోతి): కవిటి గ్రామస్థుల అభిమానాన్ని ఎన్నటికీ మరువలేనని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బి.అశోక్ తెలిపారు. సోమవారం కవిటిలోని చింతామణి అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే అశోక్ దర్శించుకుని పూజలుచేశారు. కార్యక్రమంలో నాయకులు బి.రమేష్, ఎ.మధు, బి.కామరాజు, పి.లక్ష్మణమూర్తి, టి.మోహనరావు, బి.తిరుమలరావు, వి.రంగారావు, ఎ.రాజు, బి.సురేష్, జి.రామారావు పాల్గొన్నారు.

ఆదిత్యునికి రూ.లక్ష విరాళం

అరసవల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో శాశ్వత అన్నదాన పథకానికి శ్రీకాకుళంలోని మండలవీధికి చెందిన పల్లా అప్పలనాయుడు, కళావతి దంపతులు రూ.లక్ష ప్రకటించారు. ఈ మేరకు సోమవారం ఆదిత్యుని ఆలయ ఈవో భద్రాజీకి అందజేశారు.

రైళ్లకు హాల్టింగ్ సదుపాయం కల్పించాలి

కంచిలి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కంచిలి రైల్వేనిలయం సమీపంలో గల రైల్వే స్టేషన్‌ల్లో పాసింజర్ రైళ్లకు హాల్టింగ్ సదుపాయం కల్పించాలని జడ్ఆర్‌యూసీసీ సభ్యుడు శ్రీనివాస్‌రౌళో కోరారు. ఈ మేరకు సోమవారం ఖుర్ధారోడ్ డివిజనల్ రైల్వే మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. బరంపురం-విశాఖపట్నం(08531-08532) పాసింజర్ స్పెషల్ బారువా, జాడుపూడి రైల్వే స్టేషన్‌లో, కటక్-గుణుపూర్, కటక్ మెమో ట్రైన్08443-08444 భువనేశ్వర్-పలాస-(మెమో) రైలు జాడుపూడి ఆర్ఎస్, బారువా స్టేషన్‌లో హాల్టింగ్ సదుపాయం కల్పించాలని కోరారు.

'పల్లెపండుగ' పనులు వేగవంతం చేయాలి

జి.సిగడాం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పల్లెపండుగలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరుచేసిన సీసీరోడ్ల పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో గుంట ముక్కల రామకృష్ణ కోరారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో వెండర్లతో సమావేశం నిర్వహించారు.సమావేశంలో టీడీపీ మండలాధ్యక్షుడు కుమరాపు రవికుమార్, బూరాడ వెంకటరమణ, టంకాల మౌళీశ్వరరావు, బాలబొమ్మ వెంకటేశ్వరరావు, పీఆర్ జేఈ సత్యనారాయణ, ఏపీవో సత్యనారాయణ, సీసీ పురుషోత్తమరావు పాల్గొన్నారు.

కిడ్నీవ్యాధి బాధితులను పర్యవేక్షించాలి

● జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా



మాట్లాడుతున్న జునైద్ అహ్మద్ మౌలానా

గుజరాతీపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఉద్దానం ప్రాంతంలో పెరుగుతున్న కిడ్నీవ్యాధి బాధితులను నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. సోమవారం శ్రీకాకుళంలోని జిల్లా కోర్టు ఆవరణలో వైద్యాధికా రులు, రెవెన్యూ అధికారులతో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్దానంలోని డాక్టర్లు, నెఫ్రాలజిస్టులు, సైకాలజిస్టులు, ఎన్జీవోలు బాధితులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. సమావేశంలో నాలుగో అదనపు జిల్లా న్యాయాధికారి ఎం.ఫణికుమార్, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

అహంకారంతో రాజ్యపాలన చేయకూడదు

శ్రీకాకుళంకల్చరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):అహంకారంతో రాజ్యపాలన చేయకూడదని సామవేదం షణ్ముఖశర్మ తెలిపారు. సోమవారం శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిర్‌లో ఉపనిషన్మందిరం,సుమిత్ర కళాసమితి ఆధ్వర్యంలోసూర్యదర్శనం పేరుతో ప్రవచనాలు మూడోరోజు కూడా నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సాత్వికగుణం కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్ర మంలో ఇప్పిలి శంకర శర్మ, గుమ్మా నగేష్, మండవల్లి రవి, విశ్వనాధం, కామేశ్వర రావు, బాబూరావు పాల్గొన్నారు.

పాఠశాల మైదానంలో అక్రమ నిర్మాణం

లావేరు,నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):లావేరు జడ్పీఉన్నత పాఠశాల మైదానంలో అక్రమనిర్మాణం జరుగుతున్నా విద్యాశాఖాధికారులు చోద్యంచూస్తుండడంపై సర్వత్రా విమర్శలొస్తున్నాయి. పాఠశాలసమీపంలోని వస్త్రపురి కాలనీకు చెందిన కొందరు పెద్దలు, యువత కలిసి ఇటీవల పాఠశాలలో ప్రహరీ లోపల ఆలయం పేరుతో పనులు ప్రారంభించారు. ఎటువంటి అనుమతి లేకుండా ఈనెల 21న ఓ మాజీ ప్రజా ప్రతినిధి కుమారుడు దంపతుల చేతులమీదుగా ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడ అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.కాగా ఈ విషయం తన దృష్టికి వచ్చిందని ఎంఈవో మురళీకృష్ణ తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు.

ఏపీఎస్‌టీఏ జిల్లా అధ్యక్షుడిగా మల్లేష్

ఇచ్ఛాపురం, నవంబరు25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్‌టీఏ) జిల్లా అధ్యక్షుడిగా సప్పటి మల్లేష్ ఎన్నికైనట్లు ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చందనరావు ఒక ప్రకటనలో తెలిపారు. మల్లేష్ ఎన్నికపై సంఘ నాయకులు ఉపాధ్యాయులు పద్మనాభం, చంద్రశేఖర్, తేజేశ్వరరావు, సంతోష్‌కుమార్, సుభాష్‌చంద్ హర్షం వ్యక్త చేశారు.

రెడ్డిక సంఘం కార్యవర్గం ఎన్నిక

ఇచ్ఛాపురం, నవంబరు25(ఆంధ్రజ్యోతి): పట్టణ స్వేచ్ఛావతి రెడ్డిక కుల సంఘం కార్యవర్గం ఎన్నిక సోమవారం స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం ప్రాంగణంలో జరిగింది. 23 మంది కార్యవర్గ సభ్యులతో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా దుర్గాసి పాపారావు, ఉపాధ్యక్షుడిగా పరపటి కోటి, కార్యదర్శిగా బర్ల లక్ష్మణరావు, ట్రెజరర్‌గా ఉప్పాడ చిన్నారెడ్డి, జాయింట్ సెక్రటరీగా దక్కత బాషా ఎన్నికయ్యారు.

ఉపకార వేతనాల కోసం ఇంటర్వ్యూలు

ఎచ్చెర్ల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో బెంగళూర్‌కు చెందిన శిక్షణ ఫౌండేషన్‌ఆపరేషన్స్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ విద్యార్థినులకు ఉపకార వేతనాలకోసం సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని ఆరురాష్ట్రాల్లో ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు ఉపకార వేతనాలను ఈ సంస్థ అందజేస్తోంది. ఈ మేరకు వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈఈఈ విద్యార్థినులకు ప్రత్యేక ఉపకార వేతనాల కోసం ఆ సంస్థ సాంకేతిక ప్రతినిధి రంజిత్ వర్చువల్ మోడ్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన వారికి ఉచిత ల్యాప్‌టాప్‌లు, కోర్సు పూర్తయ్యేవరకు ఏడాదికి రూ.20 వేలు ఉపకార వేతనంగా అందజేస్తారు. ఈమేరకు ఇంటర్వ్యూలనువర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజశేఖరరావు పర్యవేక్షించగా, వర్సిటీ బీసీడీఈ కోఆర్డినేటర్ బి.అజయ్‌కుమార్, ఈఈఈ విభాగపు సమన్వయకర్త టి.భవానీ ఆధ్వర్యంలో జరిగాయి.

ఖోఖోలో సత్తాచాటిన బాలికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన బాలికలు పల్నాడుజిల్లాలో జరిగినరాష్ట్రస్థాయి అండర్-14 ఖోఖో పోటీల్లో సత్తాచాటారు.ఈ మేరకు ద్వితీయస్థానాన్ని కైవశం చేసుకున్నారు. దీంతో డీఈవో తిరుమల చైతన్య, పీఈటీ,పీడీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంపీ రమణ, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, కె.మాధవరావు బాలికలను అభినందించారు.

విద్యార్థినులకు గివింగ్ వింగ్స్ టు డ్రీమ్స్ అవార్డు

గుజరాతీపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలోని ఐదుగురు విద్యార్థినులు గివింగ్ వింగ్స్ టు డ్రీమ్స్-2024 అవార్డును కేంద్ర పౌరవిమానయాన శాఖ కార్యదర్శి చేతులమీదుగా అందుకున్నారు. విమానయాన రంగంలో మహిళలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో వ్యాసరచన పోటీను నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళా కళాశాల విద్యార్థినులు పి.అనిత, పి.నాగమణి, జి.గంగోత్రి, వై.జ్యోత్స్న, వై.అఖిల ప్రతిభచూపడంతో ఢిల్లీలో అవార్డు అందుకున్నారు. ఐదు అవార్డులను గెలుచుకోవడంపై సిబ్బంది అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు రణస్థలం విద్యార్థుల ఎంపిక

రణస్థలం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో జాతీయ రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో శ్రీనారాయణ విద్యార్థులు ప్రతిభచూపి రాష్ట్ర స్థాయి పోటీలకుఎంపికయ్యారు. వకృత్వపోటీల్లో పైడి తనూజ, వ్యాస రచన పోటీల్లో బొంగుజ్యోతి ప్రథమ స్థానం నిలిచారు. ఈ మేరకు విద్యార్థులను ఎంఈవోలు ఎ.త్రినాథరావు, లావణ్య అభినందించారు.

నేడు రాజ్యాంగ దినోత్సవం

ఆమదాలవలస, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం రాజకీయాలకతీతంగా అందరూ నిర్వహించాలని రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ మోహన్‌రావు కోరారు. సోమవారం స్థానిక కళాశాల ఆవరణలో రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్ర మంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బిశ్యామసుందర్, వేదిక గౌరవ సలహాదారు నల్లి ధర్మారావు, ఏపీ యూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్.ఈశ్వరరావు, లెక్చరర్లు ధనుంజ యరావు, జి.తిరుపతిరావు, సందీప్‌కుమార్, రాజారావు, రవిబాబు, పుష్పలత, సుజాత పాల్గొన్నారు.

రేపు కృత్రిమ అవయవాల పంపిణీ

ఇచ్ఛాపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, పోలియో బాధితులకు కాలిపర్స్‌ను బుధవారం వెంకటేశ్వర పాఠశాలలో గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో పంపిణీచేయనున్నట్లు మదర్ వలంటీర్ ఆర్గనైజేషన్ జిల్లా నాయకులు ఎం.భాస్కరరావు ప్రకటనలో తెలిపారు. దీంతో పాటు పాఠశాల వద్ద దివ్యాంగుల రాయితీ ఆర్టీసీ బస్ పాస్ దరఖాస్తులు, చంక కర్రలు, వినికిడి యంత్రాలకుదరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఐడీ కార్డులు లేని దివ్యాంగులకు నమోదుచేస్తున్నట్లు తెలిపారు.ఆసక్తిగల వారు ఆధార్‌కార్డుసదరం ధ్రువపత్రం, పాస్ పోర్టు సైజ్‌దివ్యాంగత్వం ఫోటోలు, తీసుకొని రావాలని తెలిపారు. వివరాలుకు 9989371952 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

29న చలో శ్రీకాకుళం

అరసవల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చలో'శ్రీకాకుళం'కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఎస్సీ ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి పిలుపునిచ్చింది.ఈ మేరకు ఈనెల 29న నిర్వహించే ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను ఇలిసిపురంలో గల అంబేడ్కర్ విజ్ఞాన మందిర్‌లో సోమవారంఆవిష్కరించారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ టైక్వాండో శ్రీను, కోకన్వీనర్ కంఠ వేణు, బడియాకామరాజు, రాయి వేణుగోపాల్, బొనెల రమేష్, బొడ్డేపల్లి భూపతిరావు, గురుమూర్తి, గండి ఉమామహేశ్వ రరావు,గిరి, పెయ్యిల చంటి,యడ్ల జానకిరావు, బేసిప్రసన్నకుమార్, ప్రతాప్ పాల్గొన్నారు.

● జి.సిగడాం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణకు వ్యతిరేకంగా దళితులంతా ఐక్యం కావాలని ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సాకేటి నాగరాజు పిలుపునిచ్చారు. వాండ్రంగి పంచాయతీ చీడీపేటలో వర్గీకరణను రద్దుచేయాలని కోరుతూ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు కళ్లేపల్లి రాంగోపాల్, బొనెల రమేష్, బొడ్డేపల్లి భూపతి, యడ్ల జానకిరామ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో అలసత్వం వహిస్తే చర్యలు

● జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

జలుమూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యం కొనుగోలులో అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ హెచ్చరించారు. టెక్కలిపాడులోని వెంకటసాయి, సారవకోట మండలం కొండపోలవలసలోని వెంకట మల్లేశ్వరస్వామి మోడరన్ రైసు మిల్లులను సోమవారం తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని సూచించారు. రైతులు మిల్లులకు తెచ్చిన ధాన్యాన్ని సకాలంలో దించి వారికి ఇబ్బంది లేకుండా చూడాలని మిల్లర్లకు సూచించారు. చాలామంది మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీ ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం బ్యాంకు గ్యారెంటీ ఇచ్చిన మిల్లులకు మాత్రమే ధాన్యం పంపిస్తున్నట్లు తెలిపారు. జియో టాగింగ్ చేయించిన వాహనాల్లో మాత్రమే ధాన్యం మిల్లుకు తరలించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జేడీ త్రినాథస్వామి, జలుమూరు, సారవకోట తహసీల్దార్లు జె.రామారావు, విజయలక్ష్మి, ఏడీఏ రవీంద్రభారతి, ఏవో కె.సురేష్, తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

402 రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు

నరసన్నపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 402 రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు పౌర సరఫరాల శాఖ డీఎం కె.శ్రీనివాసరావు తెలిపారు. కరగాం రైతు సేవా కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొందరు మిల్లర్లు ఇప్పటికీ బ్యాంకు గ్యారంటీలు ఇవ్వకపోవడం వల్ల ధాన్యం కొనుగోలు ఆలస్యమవుతోందన్నారు. ఈ ఖరీఫ్‌కు మొదటి విడతలో 4.90 లక్షలు మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రణాళికలే వేశామన్నా రు. ఎ-గ్రేడు ధాన్యం రూ.2320, సాధారణ రకం క్వింటా బస్తా రూ.2300లకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రైతు ధాన్యం అందించిన 48 గంటల్లో రైతు ఖాతాలో నగదు సర్దుబాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయనతో పాటు తహసీల్దారు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ

పాడి రైతులకు ప్రోత్సాహకాలు

● డా.మంచు కరుణాకరరావు, ఏడీ, పశుసంవర్ధక శాఖ



పాతపట్నం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పాడి రైతులను ప్రోత్సహించేందుకుగాను గోకులాలు, పశుగ్రాస క్షేత్రాలు, ఆడ దూడల ఉత్పత్తి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ డా.మంచు కరుణాకరరావు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు.

ప్రశ్న: ఇప్పటివరకు ఎన్ని గోకులాలు మంజూరయ్యాయి?

జవాబు: పాతపట్నం మండలంలో 46, మెళియాపుట్టి మండలంలో 56 దరఖాస్తులు రాగా 34 యూనిట్ల చొప్పున మంజూరయ్యాయి. మిగిలిన వాటిని పరిశీలిస్తున్నాం.

ప్ర: పశుగ్రాస క్షేత్రాలకు ప్రోత్సాహకాలు ఎలా ఇస్తున్నారు?

జ: పశుగ్రాసక్షేత్రాలు 10 సెంట్ల నుంచి 50 సెంట్ల వరకు ప్రోత్సాహకాలు ఇస్తున్నాం. వాటి విస్తీర్ణాన్ని బట్టి రాయితీ వస్తుంది.

ప్ర: ఆడదూడల పెంపకానికి ప్రోత్సాహకాలిస్తున్నారా?

జ: సెక్స్ షార్టెడ్ సెమాన్ మిషన్ (ఎస్ఎస్ఎస్ఎం)లో భాగంగా చూడిద వ్యాక్సిన్‌ను ఆడ దూడలు పుట్టేందుకు అందజేస్తున్నాం. ఇప్పటివరకు సుమారు 150 వ్యాక్సిన్లు అందించాం.

ప్ర: పశుగణన ఎంతవరకు వచ్చింది?

జ: ఇప్పటి వరకు 6,197 పశువుల గణన పూర్తయింది. ఫిబ్రవరి 28 నాటికి శతశాతం పూర్తిచేస్తాం.

క్రైం కార్నర్

వివాహిత ఆత్మహత్య

● వరకట్న వేధింపులే కారణం: తల్లిదండ్రులు


ఆత్మహత్యకు పాల్పడిన దృశ్యం (ఇన్‌సెట్‌లో) నీరజాక్షి (ఫైల్)

పలాస, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పలాస మండలం ఈదురా పల్లి గ్రామంలో సోమవారం ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. వర కట్నం వేధింపులతోనే తన కుమార్తెను చంపేశారని ఆమె తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌కు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు చేరుకొని నిరసన తెలిపారు. వారం రోజుల వ్యవధిలో ఇద్దరు వివాహితలు ఇదే గ్రామంలో ఆత్మహత్యకు పాల్పడడం కలకలం రేపుతోంది. కాశీబుగ్గ సీఐ డి.మోహనరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన పైల వినోద్ ఢిల్లీలోని మిలటరీ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఆయనకు మెళియాపుట్టి మండలం టకోయి గ్రామానికి చెందిన పల్లి సంపతిరావు, ధనలక్ష్మి చిన్న కుమార్తె నీరజాక్షి (19)తో ఆరు నెలల కిందట వివాహమైంది. అనంతరం ఢిల్లీలో కాపురం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో వారం రోజుల కిందట గ్రామం లో కార్తీక పౌర్ణమి వేడుకలు నిర్వహించేందుకు ఇద్దరూ వచ్చారు. సోమవారం సాయంత్రం భర్త వేరే గదిలో నిద్రిస్తుండగా ఆమె ఇంటి కొక్కేనికి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనా స్థలానికి సీఐ చేరుకొని మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టు మార్టం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భర్త, అత్తవారింటి వేధింపులతోనే..

వివాహ సమయంలో రూ.10 లక్షల కట్నం ఇచ్చేందుకు ఆమె తల్లిదండ్రులు అంగీకరించారు. రూ.5 లక్షలతో పాటు బంగారం, ఇతర కానుకలు అల్లుడికి ఇచ్చారు. మిగిలిన రూ5 లక్షలు తీసుకురావాలని వినోద్‌తో పాటు వారి తల్లి దండ్రులు వేధించారని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో మీ కుమార్తె ఉరి పోసుకొని ఆత్మ హత్యకు పాల్పడిందని ఫోన్ చేశారని, ఇంటికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించగా అనేక అనుమానాలు కలుగుతున్నాయన్నారు. కట్నం వ్యవహారంతోనే తన కుమార్తె మృతి చెందిందని, న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న టకోయి గ్రామస్థులు కూడా మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

73 పశువుల స్వాధీనం

నరసన్నపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పశువులను అక్రమంగా తరలిస్తున్న ఆరు వాహనాలను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మడపాం టోల్ గేట్ వద్ద సోమవారం తెల్లవారుజామున వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనాలు పట్టుబడినట్లు తెలిపారు. ఐదు వాహనాలతో పాటు ఒక కంటైనర్‌లో తరలిస్తున్న 73 పశువులను పట్టుకొని కొత్తవలస గోశాలకు తరలించినట్లు పేర్కొన్నారు. ఐదు వాహనాలతో పాటు ఒక కంటైనర్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు.

మనస్తాపానికి గురై యువకుడి ఆత్మహత్య


సాయికుమార్ (ఫైల్)

కొత్తూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మనస్తాపానికి గురైన యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నివగాం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. వాడ సాయికుమార్ (23) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ తరుణంలో ఓ వివాహిత మహిళతో కొద్ది నెలల కిందట పరిచయం ఏర్పడి ఇద్దరూ ఇళ్ల నుంచి వెళ్లిపోయారు. కొద్దిరోజుల్లోనే ఆమె తిరిగి తన భర్త వద్దకు వెళ్లిపోయింది. అప్పటి నుంచి మనస్తాపానికి గురై ఆదివారం ఉదయం ఏడు గంటలకు ఇంటి నుంచి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చి మరలా ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లి తల్లి రోహిణికి ఫోన్ చేసి చనిపోతానని చెప్పాడు. అప్పటి నుంచి చుట్టుపక్కల వెతికినా జాడ తెలియలేదు. సోమవారం ఉదయం గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల వెనుక భాగంలో ఉన్న చెట్టుకు తాడుతో ఉరివేసుకొని ఉన్న యువకుడి స్థానికులు సాయికుమార్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు మృత దేహాన్ని పాతపట్నం ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై కొత్తూరు ఎస్ఐ ఎండి అమీల్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో దాడి చేసిన వ్యక్తిపై కేసు

శ్రీకాకుళం క్రైం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై కారు అడ్డంగా పెట్టిన విషయమై ప్రశ్నించడం తో మద్యం మత్తులో ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటన శ్రీకాకుళం నగరంలో కలకలం రేపింది. పోలీసులు, బాధితుడి కథనం మేరకు.. శ్రీకాకుళంలోని గొల్కొండ రేవు వీధిలో ఆదివారం రాత్రి ఒప్పంగికి చెందిన సరస్వతుల పవన్ మణికంఠ మద్యం తాగి కారులో అక్కడికి వచ్చాడు. కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న దమ్మల వీధికి చెందిన సూరాడ సత్యం విధులు ముగించుకుని రాత్రి 8.45 గంటలకు ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. ఆ సమయంలో గోల్కొండ రేవు వీధిలో పవన్ తన కారును రోడ్డుకు అడ్డంగా పెట్టాడు. దీంతో కారు పక్కన పెట్టాలని, రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని సత్యం అన్నాడు. దీంతో కోపోద్రిక్తుడైన పవన్.. సత్యం బైక్ ఆపి తాళం తీసుకుని దాడి చేశాడు. దీంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని వారిని నిలువరించారు. ఇంతలోనే పోలీసులు అక్కడకు చేరుకోవడంతో పంచాయితీ వన్‌టౌన్‌కు చేరింది. ఘర్షణకు దిగిన సత్యం, పవన్‌కు డ్రంక్ అండ్ డ్రైవ్ చేయాలని సీఐ పైడపునాయుడు చెప్పడంతో పవన్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. సత్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్ఐ ఎం.హరికృష్ణ. పవన్‌పై కేసు నమోదుచేశారు. కాగా తనకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని, సత్యం తనపై దాడిచేశాడని సోమవారం పవన్ మణికంఠ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆలయాల్లో హుండీల చోరీ

సరుబుజ్జిలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పురుషోత్తం గ్రామంలో మందలమ్మ తల్లి, సంతోషిమాత ఆలయాల్లో ఆదివారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. మందలమ్మతల్లి ఆలయంలో ఉన్న బీరువా, హుండీ, సీసీ కెమెరాలు పగులగొట్టారు. హుండీలో ఉన్న కొంత నగదు, అమ్మవారికి సమర్పించిన మంగళ సూత్రాలు దొంగలించుకుపోయారు. సంతోషిమాత ఆలయంలో కూడా కొంత నగదు చోరీకి గురైనట్టు నిర్వాహకులు తెలిపారు.

చేపల పెంపకంతో అధిక లాభాలు



చెరువులో చేప పిల్లలను విడిచిపెడుతున్న శాస్త్రవేత్తలు

ఎల్.ఎన్.పేట, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): చెరువుల్లో చేప పిల్లల పెంపకం ద్వారా మత్స్యకారులు అధిక లాభాలను ఆర్జించవచ్చని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సీహెచ్ బాలకృష్ణ అన్నా రు. చొర్లంగి పంచాయతీ పరిధిలోని 26 చెరువుల్లో 30,700 చేప పిల్లలను సోమవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ చేప పిల్లలను సీతంపేట ఐటీడీఏ గిరిజన సబ్‌ప్లాన్ నిధుల నుంచి మంజూరు చేసినట్లు తెలి పారు. మత్స్యకారులు ఆర్థికంగా నిలదొక్కుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కార్యక్రమంలో విస్తీర్ణ శాస్త్రవేత్త జీఎస్ రాయ్, ఎఫ్‌డీవో ముసలి నాయుడు, గ్రామ మత్స్యశాఖ సహాయకురాలు ఐ.దేవిశ్రావ్య పాల్గొన్నారు.

సారా తయారీ కేంద్రాలపై దాడి

మెళియాపుట్టి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ ప్రాంతాల్లో సోమవారం సారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ అధి కారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సారా స్వాధీనం చేసుకోవడంతో పాటు బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. ఆ వివరాలిలా ఉన్నాయి. సవర కొత్తూరు గ్రామంలో సోమ వారం టెక్కలి, నరసన్నపేట ఎక్సైజ్‌శాఖ అధి కారులు దాడులు చేసి 500 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేయడంతో పాటు 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు టెక్కలి సీఐ మీరాసాహెబ్ తెలిపారు. ఎక్కడైనా సారా తయారు చేస్తున్న సమాచారం ఉంటే తెలియజేయాలన్నారు. సారా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ దాడు ల్లో ఎస్ఐలు సత్యనారాయణ, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

1400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

హరిపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మందస మండలం చాపరాయి గ్రామంలో సోమవారం దాడి చేసి 1400 బెల్లం ఊటను ధ్వసం చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. సోంపేట ఎక్సైజ్, పలాస ఏఈఎస్‌టీ ఎఫ్ సంయుక్తంగా ఈ దాడులు నిర్వహించినట్లు చెప్పారు. సారాను సమూలంగా అరికట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

14 లీటర్ల సారా స్వాధీనం

కంచిలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బలియా పుట్టుగ గ్రామానికి చెందిన సాహుకారి మల్లేశ్ వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 14లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి.పారినాయుడు తెలిపారు. మల్లేశ్ ఇంటి వద్ద సారా ఉందన్న వచ్చిన సమాచారం మేరకు సోమవారం సిబ్బందితో కలిసి సోదా నిర్వహించినట్లు చెప్పారు. ఈ మేరకు 140 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని మల్లేశ్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు.

పొన్నంపేటలో 28 మద్యం సీసాలు..

ఆమదాలవలస, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పొన్నంపేటలో ఓ వ్యక్తి అక్రమంగా నిల్వ చేసిన 28 క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వా ధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. సోమవారం వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో తనిఖీ నిర్వహించినట్లు చెప్పారు. ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరిపై కేసు

పాతపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మద్యం బాటిళ్లను అనధికారికంగా ఉంచిన ఇద్దరిని పట్టు కుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. సింగు పురం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి వద్ద ఆరు, పాతపట్నం గ్రామానికి చెందిన ఓవ్యక్తి వద్ద ఆరు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

గ్రామాలకు పూర్వ వైభవం: మంత్రి అచ్చెన్న


ఇప్పిలి జగదీష్‌ను అభినందిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): టెక్కలి నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి పూర్వ వైభవం తీసుకువస్తానని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం నిమ్మాడలోని తన క్యాంపు కార్యాల యంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం, కోటబొమ్మాళి మండలాల నుంచి వచ్చిన ప్రజలు వివిధ సమస్యలపై వినతిపత్రాలు అందించగా వాటిని స్వీకరించి పరిశీలించి వారితో మా ట్లాడారు. కొన్ని సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగ తిన పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా సాగు, తాగునీరు, రోడ్లు, కాలువ లు వంటి మౌలిక వసతులపై చొరవ చూపాలన్నారు. అలా గే ప్రజలు కూడా అభివృద్ధికి సహకరించాలని, గ్రామాల్లో ఇంకా ఎటువంటి సమస్యలు ఉన్నా ప్రణాళికలు తయారు చేసి తన దృష్టికి తీసుకు రావాలని కోరారు.

యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌కు అభినందన

టెక్కలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన టెక్కలి మండ లం చిన్న నారాయణపురానికి చెందిన ఇప్పిలి జగదీష్‌ను మంత్రి అచ్చెన్నాయుడు సోమవారం నిమ్మాడలో అభినందించారు. మంత్రికి కృతజ్ఞతలు తెలిపేందుకు వచ్చిన జగదీష్‌ను మంత్రి శాలువా కప్పి సత్కరిం చారు. యాదవ కార్పొరేషన్ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో యాదవ సంఘ నాయకులు లొడగల కామేశ్వరరావు, దాసరి వాసు, నర్తు కృష్ణ, కోనారి శ్రీరాములు, సబ్బి జానకిరాం, దాసరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజామోదంతోనే ఎయిర్‌పోర్టు నిర్మాణం

● ఒంకులూరులో రైతులతో కూటమి నాయకుల సమావేశం


మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు మోహనరావు

వజ్రపుకొత్తూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజామోదంతోనే తీరప్రాంతంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం జరుగుతుందని, సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కూటమి నాయకులు అన్నారు. ఈ మేరకు ఒంకులూరులో ఎంపీటీసీ కొండా సురేఖ ఆధ్వర్యంలో మోటూరు, గుణుపల్లి, చీపురుపల్లి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రజామోద ప్రభుత్వమన్నారు. రైతుల నుంచి బలవంతంగా భూములు తీసుకొనే ప్రసక్తే లేదన్నారు. వెనుకబడి ఉన్న తీరప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష ఈ ప్రాంతంలో ఎయిర్ పోర్టుకు ప్రతిపాదనలు చేశారని, వారి సూచనల మేరకు ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఎయిర్ పోర్టు వల్ల ఈ ప్రాంతం అభివృద్ధి చెందడంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్న విషయం మరిచిపోవద్దన్నారు. రైతులు ఇచ్చే భూములకు మంచి ధర వస్తుందన్నారు. అయినా అధికారులు రైతులతో మాట్లాడిన తరువాతే ఎయిర్‌పోర్టు ప్రతిపాదన ముందుకు సాగుతుందన్నారు. అంతవరకు రైతులు ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు కూటమి నాయకులు ఎ.ఉమామహేశ్వరరావు, ఎన్.సూర్యనారాయణ, ఎల్.భీమారావు, జె.తిరుపతిరావు, ఒంకులూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు ధనుంజయ, సాతుపల్లి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

మందస, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు అన్నారు. సోమవారం స్థానిక ఎస్ఆర్ఎస్ఎం జడ్పీ హైస్కూల్‌లో 'సంకల్పం'లో భాగంగా విద్యార్థులకు అవగాహన కలిగించారు. మత్తు పదార్థాల వల్ల జీవితాలు ఛిద్రమవుతాయని, దీంతో కుటుంబాలకు ఇబ్బందికరమన్నారు. మత్తుపదార్థాల విక్రయం, వినియోగం చట్టరీత్యా నేరమని, ఇందులో ఇరుక్కుంటే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతీ విద్యార్థి బాగా చదువుకుని, ఉన్నత లక్ష్యాలను సాధించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం జె.రవికుమార్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు: ఎమ్మెల్యే బగ్గు

పోలాకి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికలపై వేధింపులకు పాల్పడే వారిపై కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. జెండర్ ఆధారిట హింసపై అవగాహన కలిగించేందుకు సోమవారం పోలాకి వెలుగు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ.. బాల్యవివాహాలు నేరమని అన్నారు. మహిళా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో గరిమెళ్ల రవికుమార్, వెలుగు ఏపీఎం గోరు రాజారావు, ఉన్నత పాఠశాల హెచ్ఎం లక్ష్మి, ఎంఈవో శ్రీనివాసనాయక్, టీడీపీ నాయకులు ఎంవీ నాయుడు, భాస్కరరావు, రాంబాబు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

టిడ్కో గృహాలు త్వరలో కేటాయిస్తాం: కమిషనర్



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

పలాస, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహాలు ప్రభుత్వ పరిశీలన లో ఉన్నాయని, త్వరలోనే కేటాయించడం జరుగుతుందని మునిసి పల్ కమిషనర్ ఎస్.రామారావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక కార్యాలయం ఆవరణలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. టిడ్కో ఇళ్లు కేటాయించక పోవడంతో బ్యాంకుల నుంచి ఒత్తిళ్లకు గురవుతున్నామని పలువురు లబ్ధి దారులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు వాటిని కేటాయిస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వివిధ సమస్యలపై 16 వినతులు రాగా వాటి పరిష్కా రానికి సంబంధిత శాఖలకు పంపించారు.

మత్స్య సంపదకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోండి

టెక్కలి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలం పాతమేఘ వరం పంచాయతీ రొయ్య పిల్లల ఉత్పత్తి కేంద్రం వల్ల సముద్రంలోని మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని మత్స్యకార సంఘ నాయకుడు సూరాడ ధనరాజ్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాల యంలో నిర్వహించిన 'మీకోసం'లో ఏవో రషీద్ అహ్మద్‌కు వినతిపత్రం అందించారు. సదరు కేంద్రం నుంచి కెమికల్స్‌ను పైప్‌లైన్ ద్వారా సముద్రంలోకి వదులుతున్నారని ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. తక్షణం పైపులైన్లు తొలగించి మత్స్యకారులకు న్యాయం చేయాలని కోరారు. పలువురు రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని వినతిపత్రాలు అందించారు.

గుల్లలపాడులో ఆక్రమణలు తొలగించండి

వజ్రపుకొత్తూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చినవంక పంచాయతీ గుల్లలపాడులో శ్మశానవాటి రోడ్డు, ఇతర రహదారులు ఆక్రమణలకు గుర య్యాయని, వాటిని తొలగించాలని పీఏసీఎస్ మాజీ చైర్మన్ దువ్వాడ హేం బాబు చౌదరి కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ సీతారామయ్యకు సర్పంచ్ దువ్వాడ విజయలక్ష్మి తరఫున ఫిర్యాదు చేశారు. ఈ రోడ్లను సర్వే చేయించి ఆక్రమణలను తొలగిస్తే సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు.

సామాజిక అంతరాలను తొలగించేది విద్య

హరిపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో సామాజిక అంతరాలు తొలగించి జ్ఞానం ఇచ్చేది విద్య మాత్రమేనని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు అన్నారు. హరిపురం హైస్కూల్ ఆవరణలో యూటీఎఫ్ స్వర్ణోత్సవాల మహాసభలు రెండోరోజు సోమవారం నిర్వహించారు. ఉపాధ్యాయ సమ స్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు. ఓపీఎస్ పునరుద్ధరణ, 117 రద్దు, కామన్ సర్వీసు రూల్స్ రూపొందించి సమస్యలను పరిష్కరించి పదోన్నతులకు మార్గం సుగమం చేయాలని కోరారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో యూటీఎఫ్ మండల కార్యవర్గాలను ఎన్నుకున్నారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్, కిషోర్‌కుమార్, ప్రతినిధులు కొండదరావు, జగదీష్, ఎల్వీ చలం, జయరాం, మాధవరావు, రమేష్, ధనలక్ష్మి, వాగ్దేవి తదితరులు పాల్గొన్నారు.

షణ్ముఖ మాస్టార్‌కు బహుమతులు


సాంస్కృతిక పోటీల్లో విజేత షణ్ముఖకు బహుమతి అందజేస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

కోటబొమ్మాళి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా ఉపాధ్యాయులకు నిర్వహించిన సాంస్కృతిక విభాగం పోటీల్లో కొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు షణ్ముఖ మాస్టార్ నాటికలు, అభ్యుదయ గీతాలు, మిమిక్రీలో విశేష ప్రతిభ కనబరిచారు. ఈ నేపథ్యంలో సోమవారం మందస మండలం హరిపురంలో జరిగిన యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వరరావు బహుమతులు అందించి అభినందించారు.

న్యూస్ బాక్స్

నేడు శ్రీముఖలింగేశ్వరుని హుండీల లెక్కింపు

జలుమూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగేశ్వరాలయంలోని హుండీలను మంగళవారం లెక్కిస్తున్నట్లు ఈవో పి.ప్రభాకరరావు తెలిపారు. కార్తీకమాసంలో శ్రీముఖలింగేశ్వరునికి వచ్చిన ఆదాయాన్ని దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో ఉదయం 11 గంటలకు తెరిచి లెక్కించనున్నామన్నారు. గ్రామ పెద్దలు, అర్చకులు హుండీ లెక్కింపులో పాల్గొనాలని కోరారు.

సమయపాలన పాటించాలి

కొత్తూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో నీరజ అన్నారు. పారాపురం గ్రామ సచివాలయాన్ని సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఇండియా (ఎన్‌పీసీఐ)తో బ్యాంకు ఖాతాలు అనుసంధానం కాని వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని, ఇంటింటి సర్వేతో పాటు క్లస్టర్ మ్యాపింగ్ విజయవంతం చేయాలని సూచించారు. పలైవలసిదుగ కార్యక్రమంలో చేపడుతున్న శ్మశాన వాటిక రహదారి పనులను పరిశీలించారు.

అంగన్‌వాడీ కార్యకర్త మృతి

ఎల్.ఎన్.పేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పూశాం గ్రామ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త శివ్వాల కామేశ్వరి (45) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. ఈమె గతకొంతకాలంగా దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నారు. జూన్ నుంచి సెలవులో విధులకు హాజరుకాలేదని భర్త లక్ష్మ నాయుడు తెలిపారు. వీరికి ఐదేళ్ల కుమా రుడు ఉన్నారు. కామేశ్వరి మృతికి గ్రామస్థులు, అంగన్‌వాడీ సిబ్బంది సంతాపం తెలిపారు.

మూలపేట నిర్వాసితుల మధ్య వాగ్వాదం

టెక్కలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మూలపేట పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు ఏర్పాటుకు సంబంధించి సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వాసితుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు రీ సర్వేకి సంబంధించి కొందరు రైతులకు నోటీ సులివ్వడంతో వారంతా సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. రెవెన్యూ అధికారులు నిర్వాసితుల భూముల వివరాలు ఆరా తీస్తున్న సమయంలో కొందరు రైతుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. భూముల వివరాల తప్పిదాలు సరిచేస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ రైతులు ఇరువర్గాలుగా ఏర్పడి కేకలు వేసుకోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. అయితే ఈ పరిస్థితిని ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్తామని అక్కడున్న రెవెన్యూ సిబ్బంది తెలియజేయడంతో వారు వెనుదిరిగారు.

ఎమ్మెల్యే కొండ్రు పరామర్శ

హిరమండలం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హిరమండలం ఎంపీటీసీ-4 చింతాడ బుద్ధ మామయ్య ఇటీవల మృతి చెందగా విషయం తెలుసుకున్న రాజాం ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్ సోమవారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్పంచ్ లంక రోజారాణి, టీడీపీ మండల అధ్యక్షుడు యాళ్ల నాగేశ్వరరావు, చింతాడ గిరి ఉన్నారు.

సకాలంలో అంగన్‌వాడీ కేంద్రాలను తెరవాలి

జలుమూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను సకాలంలో తెరిచి లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ ఆర్డీడీ చిన్మయిదేవి అన్నారు. శ్రీముఖలింగంలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు సీతా మహలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.